# 'మనిషికి వందేళ్ళు ఎందుకు? ఎలా?"

మొన్న మా ఉమానాథ్ దగ్గర కూచుని వున్నప్పుడు ఓ ఏభై అయిదేళ్ల వ్యక్తి వచ్చి "డాక్టర్‌గారూ మా తల్లిగారికి కట్టిన కట్టు జారింది" అన్నాడు. మా ఉమానాథ్ ఎముకల సర్జను. ఆ వచ్చిన వ్యక్తి యింకేమీ మాట్లాడకుండా మౌనంగా చేతులు కట్టుకు నుంచున్నాడు. ఓ అయిదు నిముషాల తర్వాత ఉమానాథే అన్నాడు "నా క్లినిక్ ముగించుకుని రాత్రి వస్తా. వచ్చి కట్టు సరిచేస్తా" ఆ వ్యక్తి తలూపి వెళ్లిపోయాడు.

మా ఉమానాథ్ మామూలుగా ఇళ్లకు వెళ్లి పేషెంట్లని చూడడు. స్పెషల్ కేసేమో అనుకున్నాను. నేను సాయంకాలం వాడి దగ్గరికెళ్తే క్లినిక్ ముగిసేవరకూ కూచోబెడతాడు. ఆ రోజూ అలాగే కూచుని ఉన్నా. క్లినిక్ అయ్యింతర్వాత... "రారా వెళ్లి ఆ కేసొక్కటి చూసొద్దాం. దాంతర్వాత ఫ్రీ" అన్నాడు.

"పద" మని వాడికి తోడుగా వెళ్లా.

ఆ పేషెంటు పండు ముసలి. తొంభై ఏళ్లుంటాయి. జారి కిందపడి తుంటి ఎముక విరగ్గొట్టుకుంది. ఆపరేషన్ చేయడానికి ఆమె వయసూ యితర జబ్బులూ అడ్డంకి. అందుకని కాలికి బరువు కట్టి లాగి వదిలేసాడు ఉమానాథ్.

మావాణ్ణి చూడగానే ఆమె అన్న మొదటి మాట "నన్నెప్పుడు నడిపిస్తావు నాయినా నా మనవడి పెళ్లి చూడాలి" అన్నది.

ఆమె ముఖంలో తీక్షణంగా చూస్తే జీవితేచ్ఛ దిగంబరంగా కనిపించింది. ఇంకా ఏం అనుభవించాలని ఆమె జీవితం కోరుకుంటుందో అర్థంకాలేదు నాకు (నాలాంటి వెధవలకర్థం కాదేమో) "ఇంకో మూణ్ణెలల్లో నడిపిస్తాలే అవ్వా" అని ఆ వృద్ధురాలి భుజం తట్టాడు మావాడు. "మూణ్ణెల్లా;" అని బాధగా అందామె. బైటికొచ్చింతర్వాత మావాడి నడిగా "నిజంగా నడుస్తుందంటావా?" అని. "అబ్బే... కొశ్చన్లేదు... షీవిల్ క్రోక్ వితిన మంత్" అన్నాడు.

* * *

వైద్యరంగంలో శాస్త్రజ్ఞులు సాధించిన ప్రగతితో ప్రపంచం మొత్తమ్మీద వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరిగిందట. ఆ ముసలామెను చూసిన వెంటనే నిజానికి నాకు స్వామి దయానంద చెప్పిన కథ గుర్తొచ్చిందసలు.

మీలో చాలామందికి ఆ కథ తెల్సి ఉండవచ్చు. తెలియనివాళ్లకోసం ఆ కథ యిస్తున్నాను.

భగవంతుడు సృష్టి చేస్తున్నపుడు మనిషికి గాడిదకు కుక్కకూ గబ్బిలానికి చెరి నలభై ఏళ్ళ జీవితాన్నిచ్చాట్ట. గాడిద కుక్కా గబ్బిలం మౌనంగా ఉంటే మనిషి "దేవుడా ప్రపంచంలో యిన్ని సుఖాలు పెట్టావు. పెట్టి కేవలం నలభై ఏళ్లే జీవితాన్నిస్తే ఏమిటి అనుభవించడం" అన్నాట్ట.

మానవా నేనేమీ చేయలేను. ఈ జంతువులు తమ ఆయుష్షు కోల్పోడానికి సిద్ధపడితే ఆ ఆయుష్షు నీకు కలుస్తుంది" అన్నాట్ట. అని మొదట గాడిదనడిగాడట "నీ ఆయుష్షేమైనా మనిషికివ్వగలవా?"

"ఈ గాడిద బతుకు నలభై ఏళ్లెందుకు స్వామీ ఓ ఇరవై చాలు మిగిలిన ఇరవై మనిషికిచ్చేయి" అందట.

అట్లాగే కుక్క గబ్బిలం కూడా చెరి ఇరవై ఏళ్లు మనిషికి దానం చేసాయట. ఆ జంతువులు దానం చేసిన ఆయుష్షు ఆ జంతువుల జీవితాలనే పోలి వుంటుంది. నలభై ఏళ్లు బాగా బతికి దాంతర్వాత సంసారమనే గాడిద బరువు మోస్తూ అరవై దాకా... ఆ తర్వాత కుక్కలా ఇంటిని కాస్తూ ఓ ఇరవై... ఆ తర్వాత గబ్బిలంలా వేలాడ్తూ ఎప్పుడు చస్తాడా అని అందరూ ఎదురుచూస్తున్నా జీవిస్తూనే గడుపుతాడట.

* * *

***రానురాను పతనమైపోతున్న నైతిక విలువలూ... విష సాంప్రదాయాలూ చూస్తుంటే అరవైకి మించిన జీవితం నరకమే అనిపిస్తుంది.*** ●